క్లుప్తంగా

క్రీడాకారులకు అభినందనలు



రాకేష్, శ్రీ సత్యవేణిలను అభినందించిన బోధన సిబ్బంది, ప్రజాప్రతినిధులు

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కొల్లాబత్తుల రాకేష్, చెన్నంశెట్టి శ్రీసత్యవేణిలను పాఠశాల బోధనా సిబ్బంది, ప్రజాప్రతినిధులు బుధవారం అభినందించారు. అనపర్తిలో జరిగిన అండర్–14 విభాగంలో వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచిన వీరిరువురు రాష్ట్ర స్థాయి జిల్లా జట్టుకు ఎంపికైనట్టు పీడీ కె.భాస్కరరావు తెలిపారు. దీంతో పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం సోమ సూర్యకుమారి, అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతురాజు నాగేంద్రకుమార్, సర్పంచ్ పోతురాజు కిషోర్ వారికి అభినందనలు తెలిపారు.

సఖినేటిపల్లిలంకలో ఎస్‌హెచ్ఎస్ కార్యక్రమం



సఖినేటిపల్లిలంక పాఠశాల ఆవరణను విద్యార్థులతో కలసి శుభ్రం చేస్తున్న ప్రభావతి

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి ఆదేశాలతో బుధవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ఏపీ ఎన్జీసీ రాజోలు క్లస్టర్ కో ఆర్డినేటర్ జి.ప్రభావతి నిర్వహించారు. వచ్చే నెల 2వ తేదీ గాంధీ జయంతి వరకూ వివిధ పాఠశాలల్లో ఎనిమిది విభాగాల్లో ఎస్‌హెచ్ఎస్ నిర్వహించాల్సి ఉందన్నారు. ఒక్కో పాఠశాలలో ఒక్కో ఈవెంట్ నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. ఇందులో భాగంగా లంక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పరిశుభ్రత పనులను విద్యార్థులతో కలసి చేపట్టినట్టు ఆమె అన్నారు. ఇతర కార్యక్రమాలు వేర్వేరు పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్టు ఆమె చెప్పారు.

అర్థమయ్యేలా పాఠాలు బోధించాలి



కోలివారి అగ్రహారంలో విద్యార్థులు, ఉపాధ్యాయినితో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: పాఠశాలకు వచ్చే విద్యార్థులను ప్రేమతో సాకుతూ అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులకు వివరించారు. మాచవరం శివారు కోలివారి అగ్రహారంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఎంపీపీ మాట్లాడుతూ 'నాడు–నేడు'లో సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లను మించి అభివృద్ధి చేశారన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, జగనన్న గోరుముద్ద తదితర వాటిని వినియోగించుకుంటూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మట్టపర్తి వెంకటేశ్వరరావు, ర్యాలి శ్రీనివాసవుడయార్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో బుధవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. స్థానిక మెయిన్ రోడ్డు నుంచి గ్రామ సచివాలయం వరకూ సుమారు రూ.20 లక్షలతో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మిస్తున్న ఈ రోడ్డు పనులను సర్పంచ్ గుణ్ణం రాంబాబు ప్రారంభించారు. త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు.

నాణ్యత లేని పశుదాణా విక్రయిస్తే చర్యలు

అంబాజీపేట: నాణ్యతా ప్రమాణాలు లేని పశుదాణాను విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పి.గన్నవరం ఏడీఏ ఎల్.విజయరెడ్డి హెచ్చరించారు. అంబాజీపేట సత్య వెంకటేశ్వర ట్రేడర్స్, పి.గన్నవరం కల్కి మెడికల్ షాపులను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ గుర్తింపులేని, నాణ్యతలేని పశుదాణాను విక్రయించకూడదన్నారు. అలా విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి నాలుగు నెలలకోసారి పశుదాణా దుకాణాలు తనిఖీలు చేస్తామన్నారు. పశువుల షాపులో విక్రయించే దాణాల శ్యాంపిల్లను సేకరించి వాటి నాణ్యతను తెలుసుకునేందుకు విజయవాడ వెటర్నరీ బయలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు పంపుతామన్నారు. దాణా విక్రయించే దుకాణదారులు ఫీడ్ యాక్ట్ లైసెన్స్ పొంది ఉండాలన్నారు. లైసెన్స్ లేని దుకాణాలను సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామన్నారు. అంతకుముందు దాణా దుకాణాల్లో స్టాకు రిజిస్టర్లను, గోదాములను పరిశీలించారు. ఏడీఏ వెంట వైద్యాధికారులు డి.రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్ ఉన్నారు.

గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వే



రామరాజులంకలో ఆరోగ్య సురక్షపై నిర్వహించిన అవగాహన సదస్సు



జగనన్న సురక్ష ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాతి బుజ్జి

అంబాజీపేట: ప్రజల ఆరోగ్యంపై ఈ నెల 30 నుంచి సచివాలయ పరిధిలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి మాచవరం, కె.పెదపూడి, గంగలకుర్రు తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ముమ్మరంగా సర్వేను బుధవారం చేపట్టారు. సచివాలయ పరిధిలో ఇంటింటికీ తిరిగి కుటుంబంలోని సభ్యులకు బీపీ, సుగర్, ఆర్‌బీఎస్ పరీక్షలు నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వారి పలు రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వలంటీర్లు, ఎంపీహెచ్ఈఓలు పాల్గొన్నారు. జగనన్న సురక్ష సర్వే చేసి రోగుల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ముక్కామల పీహెచ్‌సీ సీహెచ్ఓ ఎం.రవికుమార్ అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: మండలంలోని రామరాజులంక సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వలంటీర్లకు, ఏఎన్ఎం, ఆరోగ్య మిత్ర, ఆశా వర్కర్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఎల్‌వో శ్రీనివాస్ ఈ పథకం గురించి విధి విధానాలను, జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల పైన అవగాహన కల్పించారు. మండల జేఏసీ కన్వీనర్ చింతా రాజబాబు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ, మండల ఏఎంసీ చైర్మన్ నల్లి శివకుమార్, ఏఎన్ఎంలు మోకా సుజాత, పి.లక్ష్మీకుమారి, ఆరోగ్య మిత్రలు, ఆశా, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: ఈనెల 30 నుంచి అక్టోబర్ నెలాఖరు వరకు అన్ని సచివాలయాల వద్ద కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రెండు టీంలుగా ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, ఇద్దరు పీహెచ్‌సీ మెడికల్ అధికారులు పాల్గొంటారన్నారు. ఈనెల 30న ఆత్రేయపురం సచివాలయాల పరిధిలో ఎంపీపీ పాఠశాల (మెయిన్) స్కూల్ వద్ద నిర్వహిస్తారన్నారు. ఏర్పాట్లను బుధవారం ఎంపీడీఓ నాతిబుజ్జి, వైద్యాధికారి వై.సుస్మిత పరిశీలించారు. ఎంపీడీఓ నాతిబుజ్జి మాట్లాడుతూ ప్రతి ఇంటికి నూరు శాతం వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఈవో పీఆర్డీ డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

రైతు ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



అవిడి పీఏసీఎస్‌లో అముడా చైర్మన్ డేవిడ్‌రాజును సత్కరిస్తున్న రాజారత్నం తదితరులు

కొత్తపేట: లాభసాటి వ్యవసాయం.. రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక వ్యవసాయాభివృద్ధి, రైతు ప్రయోజన పథకాలు అమలు చేస్తుందని అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు పాలకవర్గానికి సూచించారు. బుధవారం మండలంలోని అవిడి పీఏసీఎస్ పాలక మండలి సమావేశం పర్సన్ ఇన్‌చార్జ్ నామాడి రాజారత్నం అధ్యక్షత జరిగింది. వివిధ అంశాలపై సమీక్షించారు. అనంతరం ఇటీవల నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఏఎంసీ చైర్మన్ రెడ్డి రవీదేవిలను రాజారత్నం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తుందన్నారు. దానిలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో ఆర్బీకేని ఏర్పాటుచేసి దాని ద్వారా అనేక రైతు ప్రయోజన పథకాలు అమలు చేస్తుందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) రైతులకు అన్ని రకాల సేవలందిస్తూ, వివిధ వ్యాపారాలు సాగిస్తూ ఆర్థికంగా బలోపేతం కావాలని కౌలు రైతులకు ఏ విధమైన పూచీకత్తు లేకుండా డీసీసీబీ ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు పైలట్ ప్రాజెక్టుగా మండలంలో తొలుత ఈ అవిడి గ్రామాన్ని ఎంపిక చేసి 60 మంది రైతులకు రూ.30 లక్షలు ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ దూళి సూరిబాబు, నేతల వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ పల్లి సౌమ్య, పీఏసీఎస్ పర్సన్స్ ముషిణి వీవీ సత్యనారాయణ, పరమట సూర్యప్రకాశరావు, సీతఈట సూర్యనారాయణ, కొత్తపేట హెచ్‌డీసీ సభ్యుడు పల్లి దిలీప్, ఖండ్రిగ వైఎస్సార్‌సీపీ నాయకులు దూనబోయిన శ్రీనివాస్, పితాని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీ జనగణన తీర్మానంపై హర్షాతిరేకాలు

సఖినేటిపల్లి: రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా బీసీ జన గణన చేపట్టాలని సభ్యులు తీర్మానం చేయడం పట్ల వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు, ప్రజాప్రతినిధుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. బుధవారం ఈ మేరకు వారంతా సఖినేటిపల్లిలో వైఎస్సార్ సీపీ బీసీ సామాజికవర్గ రాష్ట్ర అధికార ప్రతినిధి పాటి శివకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో శివకుమార్ మాట్లాడుతూ, దేశ చరిత్రలో బీసీల కోసం ఒక ఘట్టాన్ని చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ ఒక చరిత్ర సృష్టించిన వ్యక్తి ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రతి రాష్ట్రంలోనూ బీసీ జన గణన జరగాలని సుమారు తొమ్మిది దశాబ్దాలుగా పోరాటాలు బీసీ కుల సంఘాలు చేస్తున్నాయని తెలిపారు. అయినా ఏ ప్రభుత్వం కూడా కనీసం దాని మీద మాట్లాడలేని పరిస్థితి నెలకొని ఉన్న తరుణంలో సీఎం జగన్ బీసీలకు సముచిత స్థానం కల్పిస్తూ, అసెంబ్లీ సాక్షిగా బీసీ జన గణనకై తీర్మానం చేయించి, కేంద్ర ప్రభుత్వానికి పంపిన ఏకైక సీఎం జగన్ అని ప్రశంసించారు. పార్టీ చేనేత విభాగం రాష్ట్ర ప్రతినిధి జాన శంకరరావు, సర్పంచ్ పి.లక్ష్మీ పద్మమంగతాయారు, ఎంపీటీసీలు జాన లక్ష్మీదుర్గ సూర్యావతి, కట్టా వెంకాయమ్మ, నాయకులు బీసబోయిన ఏసుబాబు, బర్రే రాము పాల్గొన్నారు.

ఏఎంసీ తొలి సమావేశం



ఆలమూరులో నిర్వహించిన సమావేశంలో అభివృద్ధిపై చర్చిస్తున్న కార్యవర్గ సభ్యులు

ఆలమూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో తొలి సమావేశం బుధవారం జరిగింది. చైర్మన్ యనమదల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన తొలి సమావేశంలో కార్యవర్గ సభ్యులు పాల్గొని వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. మెజారిటీ సభ్యులు మండలంలోని వివిధ గ్రామాల్లోని పుంత రోడ్లు అభివృద్ధి చేయాలని తీర్మానించారు. రాష్ట్ర పార్టీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, మండల బూత్ కమిటీ మేనేజర్ నామాల శ్రీనివాసు, వైస్ చైర్మన్ వెత్సా సురేష్‌కుమార్, సర్పంచ్ నేలపూడి లావణ్య, ఏఓ ఎస్.లక్ష్మీ లావణ్య మార్కెటింగ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

అంధులకు, వృద్ధులకు దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ ఠాగూర్, ఎన్‌జేఎం అధినేత డానియేలు

పి.గన్నవరం: నాగుల్లంక శివారు పెదకందాలపాలెం నూతన జెరూషలేము చర్చి వ్యవస్థాపకుడు జి.డానియేలు ఆధ్వర్యంలో చేస్తున్న సమాజ సేవా కార్యక్రమాలు అభినందనీయమని తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. డానియేలు ఆధ్వర్యంలో బుధవారం పేదలు, వృద్ధులు, అంధులు, కుష్ఠు రోగులకు దుస్తులు, దుప్పట్లను తహసీల్దార్ పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. ఠాగూర్ మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అని అన్నారు. కార్యక్రమంలో జాన్‌పాల్, శామ్యూల్ కుమార్, యు.జాన్‌బాబు, నల్లి శ్రీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక రంగంలో మెండుగా ఉపాధి అవకాశాలు

మలికిపురం: ప్రపంచ వ్యాప్తంగా పర్యాటక రంగంలో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని ఎస్‌కే కాంపిటీటివ్ కోచింగ్ సంస్థ ప్రతినిధులు వెంకట్, సలీమ్ అన్నారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాల గురించి విద్యార్థులకు వారు వివరించారు. ప్రిన్సిపాల్ తోరం సతీష్ అధ్యక్షతన జరిగిన పై కార్యక్రమంలో నక్కా రమేష్, రవి,ఆంజనేయులు, రాహెల్, డాక్టర్ డి.శ్రీనివాస్, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో భారీ అన్నదానం

అయినవిల్లి: గణపతి నవరాత్రుల్లో భాగంగా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి సన్నిధిలో బుధవారం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన ప్రసాదాన్ని అధిక సంఖ్యలో భక్తులు స్వీకరించారు. అలాగే సిరిపల్లిలో గణపతి నిమజ్జన వేడుకలను ఘనంగా జరిపారు. స్వామిని గ్రామంలో ఊరేగించారు.

ఈ–క్రాప్ బుకింగ్ పరిశీలన

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలో ఈ–క్రాప్ బుకింగ్‌ను ఆర్డీఓ ఎం.ముక్కంటి బుధవారం సూపర్ చెకింగ్ చేశారు. రైతు ఈ–క్రాప్ బుకింగ్ వరి వేశారా లేదా విషయాన్ని ఆయన పరిశీలించారు. ఈ–క్రాప్ బుకింగ్ అధికారులు పారదర్శకతతో పనిచేయాలని సూచించారు. ఆయన వెంట ఏఓ వై.శోభ, ఆర్బీకే సిబ్బంది ఉన్నారు.

ఆయుష్మాన్‌భవ

- పేదలకు రూ.5 లక్షల ఉచిత వైద్యం
- ప్రత్యేక శిబిరాల ద్వారా సేవలు



ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేస్తున్న డాక్టర్

మామిడికుదురు: అనారోగ్య సమస్య ఏర్పడినా, ఏదైనా ప్రమాదం సంభవించిన, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఇక ఏ విధమైన ఆందోళన చెందాల్సిన పని లేదు. ఆరోగ్యంపై ప్రజలకు భరోసా కల్పిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆయుష్మాన్ భవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తోంది. రూ.5 లక్షల్లోపు ఆదాయం కలిగిన వర్గాలకు ఆయుష్మాన్ భవ పథకం వర్తిస్తుంది. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ, ఆరోగ్య సంరక్షణ పథకాల ద్వారా కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలందిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఈ పథకం ద్వారా గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లోని వలంటీర్లు, ఏఎన్ఎంలు, సీహెచ్ఓలకు ఆరోగ్య సమస్యలపై స్పందించి నెట్ వర్క్ ఆస్పత్రులకు ఆరోగ్య మిత్రకు వివరాలు అందించి వైద్య సేవలు అందిస్తారు. రోగుల అత్యవసర పరిస్థితికి అనుగుణంగా 108 వాహనంలో నెట్‌వర్క్ ఆస్పత్రికి తరలించి అత్యవసర వైద్య సేవలు అందించేందుకు క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు.

హెల్త్‌కార్డులు ఉన్న వారందరికీ వైద్యం..

ఆయుష్మాన్ భారత్ పథకంలో హెల్త్ కార్డులు పొందిన లబ్ధిదారులకు సంవత్సరకాలంలో రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యాన్ని ఈ కార్డు ద్వారా అందిస్తారు. కుటుంబంలోని వారందరూ హెల్త్ కార్డులు పొందింతే అందరికీ ఈ పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.5 లక్షల వరకు నెట్ వర్క్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందుతుంది. ఆయుష్మాన్ భారత్ పథకంలో ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో వారానికి ఒక సారి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. వారానికి ఒక సారి నిర్వహించే ప్రత్యేక శిబిరాల్లో గైనిక్, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, అనస్తీషియా, ఆప్తమాలజీ, జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జరీ విభాగాలకు చెందిన వైద్య నిపుణులతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్య సేవలు అందిస్తారు. మొదటి విడతలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు, రెండో దఫాగా డిసెంబర్ 31 వరకు ప్రత్యేక శిబిరాల నిర్వహణకు కార్యాచరణ చేపట్టారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ అధికారులు పి.భవానీశంకర్, డి.మల్లికార్జున తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆయుష్మాన్ భారత్ సర్వే ఇప్పటికే పూర్తయిందన్నారు. ఇప్పటికే ఈ–కేవైసీ చేయించుకున్న అర్హులైన లబ్ధిదారులందరికీ దశల వారీగా కార్డులను అందజేస్తామన్నారు.

కార్డులు పంపిణీ చేశాం



ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా మంజూరైన కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశాం. దీని ద్వారా నగరం సీహెచ్‌సీలో వైద్య నిపుణుల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలందిస్తాం. రోగులకు మెరుగైన వైద్యం అవసరమైన తరుణంలో ఆయుష్మాన్ భారత్, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా నెట్ వర్క్ ఆస్పత్రులకు పంపించి వైద్యం అందించే ఏర్పాట్లు చేశాం.

– స్వర్ణలత, పీహెచ్‌సీ వైద్యాధికారి, నగరం

అక్రమ రవాణా బియ్యానికి 3న వేలం

అంబాజీపేట: స్వాధీనం చేసుకున్న అక్రమ రవాణా బియ్యాన్ని వచ్చే నెల 3న వేలం నిర్వహించనున్నట్లు ఎంఎస్‌వో ఎం.రమాదేవి బుధవారం తెలిపారు. ఈ మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలంలో స్టాక్ పాయింట్ల వద్ద నిల్వ చేసిన 58.617 మెట్రిక్ టన్నుల అక్రమంగా రవాణా చేసిన రేషన్ బియ్యాన్ని ఈ అక్టోబర్ 3న 10 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తారన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.2 లక్షలు డిపాజిట్‌గా డిమాండ్ డ్రాఫ్ట్ జాయింట్ కలెక్టర్ పేరున తీసుకోవాలన్నారు.

'మనసు పరిమళాలు' కవితా సంపుటి ఆవిష్కరణ



అమలాపురంలో కవి భీమారావు కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్/కొత్తపేట: ప్రతిభావంతమైన కవి భీమారావు కలం మనసు లోతుల్లోకి వెళ్లి మనస్సు పరిమళాన్ని అక్షరాలతో ఆవిష్కరించారని కలెక్టర్ హిమాన్షుశుక్లా అన్నారు. కొత్తపేటకు చెందిన ప్రముఖ కవి, సివిల్ ఇంజినీర్ జినిపే భీమారావు (చిన్ని) రచించిన 'మనసు పరిమళాలు' సిసింద్రీ కవితా సంపుటిని మంగళవారం రాత్రి అమలాపురం కలెక్టరేట్‌లో కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పలువురు రచయితలు రచించిన రచనలు సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తాయన్నారు. అటువంటి రచనల్లో ఈ 'మనసు పరిమళాలు' కవితా సంపుటి ఒకటన్నారు. కవి భీమారావు తన మనసు లోతుల్లోంచి సంపుటిని రచించారని పేర్కొంటూ కవిని అభినందించారు. కవి భీమారావు సిసింద్రీ ప్రక్రియ ద్వారా 211 కవితలు రచించి పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు వెంకటరాజు (నానిరాజు), ప్రముఖ సాహితీవేత్తలు నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణ, మాకే బాలార్జున సత్యనారాయన తదితరులు పాల్గొన్నారు.

వడివడిగా గంగమ్మ ఒడికి..



అంబాజీపేట గంగలకుర్రు మలుపులో స్వామివారి లడ్డూను అందుకున్న భక్తులు



కొత్తపేటలో పాటదారునికి లడ్డూ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వీరభద్రరావు



రాజోలు ఘాట్‌కు ఊరేగింపుగా తోడ్కొని వస్తున్న గణనాథుని విగ్రహం

- అంగరంగ వైభవంగా నిమజ్జనాలు
- భారీ అన్నసమారాధనలు

కొత్తపేట: గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఎవరికీ ఏ విధమైన ఇబ్బందులు లేకుండా, అపశ్రుతులు, అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు ఉత్సవ కమిటీలు, యువతకు సూచించారు. స్థానిక కోదండరామాలయం (కొత్త రామాలయం) వద్ద గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. లడ్డూను బొబ్బిలి ధర్మరాజు రూ.15,100కు పాడుకున్నారు. ఆ లడ్డూను వీరభద్రరావు చేతుల మీదుగా ధర్మరాజుకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గణపతి లడ్డూల పాటలు

గణపతి నవరాత్ర పందిళ్లలో స్వామివారి ముందుంచిన లడ్డూల పాటలు ఉత్సాహంగా జరిగాయి. స్థానిక చింతామణి గణపతి (ఆర్యవైశ్య) పందిరిలో లడ్డూకు వేలం నిర్వహించగా ఆర్యవైశ్య యూత్ సభ్యులు రూ.26,100కు పాడుకుని లడ్డూను దక్కించుకున్నారు. పొట్టి శ్రీరాములు వీధిలో వరసిద్ధి వినాయక ఉత్సవ పందిరిలో 18 కేజీల లడ్డూకు పాట నిర్వహించగా గ్రంధి నానాజీ రూ.17,600కు పాడుకున్నారు. అలాగే మరో ఏడు లడ్డూలకు పాట నిర్వహించగా పలువురు భక్తులు రూ.45,400 లకు పాడుకున్నారు.

మామిడికుదురు: గణపతి నవరాత్రుల్లో భాగంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాల నిమజ్జనాలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ వినాయకుని విగ్రహాలను ఊరేగించారు. పాశర్లపూడిలో వినాయకుడి విగ్రహాన్ని రెండెడ్ల బండిపై ఊరేగించారు. పలు గ్రామాల్లో భారీ అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. మొగలికుదురు జున్నూరినగర్‌లో గణపతి లడ్డూను స్థానిక యువకుడు నేదూరి రవికిరణ్ రూ.50 వేలకు పాటలో దక్కించుకున్నాడు. భక్తుల కోలాహలం నడుమ ఈ లడ్డూను రవికిరణ్‌కు స్థానికులు అందించారు.

అంబాజీపేట: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలను మండలంలోని పలు వినాయక ఆలయాల వద్ద బుధవారం భారీ అన్నదానాలు ఘనంగా జరిపారు. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకొన్న గణనాథుడిని మేళతాళాలు, భారీ బాణసంచా, యువకుల కేరింతల నడుమ ఆయా గ్రామాల్లో ఉన్న కౌశికల్లో నిమజ్జనం చేశారు. గంగలకుర్రు మలుపు విజయ గణపతి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. గుడాల ఫణి రూ.16,800లకు స్వామి వారి లడ్డూను వేలంలో దక్కించుకున్నారు.

ఆత్రేయపురం: మండలంలోని గణనాథులు 9 రోజుల పాటు భక్తులతో పూజలందుకుని బుధవారం సెలవు తీసుకున్నారు. మండలంలోని ఆత్రేయపురం చిన్న, పెద్ద రామాలయం, కాలువ రేవు ఏసు సెంటర్, బండారు కాలనీ తదితర గ్రామాల్లో వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. మండలంలోని పలు గ్రామాల్లో గౌతమీ, వశిష్ఠా గోదావరులకు వినాయకుని తరలించి నిమజ్జనం చేశారు. తాడిపూడిలో ఆ గ్రామానికి చెందిన ముదునూరి సురేష్‌రాజు రూ.28 వేలకు వేలంలో లడ్డూ కైవశం చేసుకున్నారు.

సఖినేటిపల్లి: మండలంలోని టేకిశెట్టిపాలెం వద్ద పుష్కరరేవులో వినాయక చవితి మహోత్సవాల్లో చివరి ఘట్టం నిమజ్జనోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. పుష్కరరేవు వద్దకు నిమజ్జనానికి గణనాథుల విగ్రహాలు తరలివచ్చాయి. స్థానిక రైతు, వర్తక సంఘం, యూత్ సర్కిల్, చిల్డ్రన్ వినాయక కమిటీ ఆధ్వర్యంలో ఈ ఏర్పాట్లు చేశారు. పుష్కర రేవు వద్ద ఏర్పాట్లను స్థానిక వనదుర్గ లైటింగ్, మైక్ సర్వీస్ ప్రొప్రయిటర్ రేకపల్లి నరసింహారావు పర్యవేక్షించారు. పల్లిపాలెం పుష్కరరేవులో స్థానిక గణనాథుని విగ్రహాన్ని అగ్నికుల క్షత్రియులు నిమజ్జనం చేశారు.

పి.గన్నవరం: గణేష్ నిమజ్జన కార్యక్రమాలను బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. పి.గన్నవరం శివాలయం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించి పవిత్ర వైనతేయ నదిలో నిమజ్జనం చేశారు. మొండెపులంక, నాగుల్లంక, చాకలిపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను బ్యాండు మేళాలతో ఊరేగించి సోంపల్లిలోని వశిష్ఠ నదిలో నిమజ్జనం చేశారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో గణనాథుడి నిమజ్జన మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రశాంతత వాతావరణంలో జరిగాయి. గణేషుడి నిమజ్జనాల తాకిడితో ఆలమూరు గౌతమీ గోదావరి తీర ప్రాంతం ×గణపతి మొప్పా మోరియా× నినాదాలతో మార్మోగిపోయింది. గణపతి విగ్రహాలను పురవీధుల్లో ఊరేగింపు జరిపారు. పలు గ్రామాల్లో నెలకొల్పిన గణేషుని విగ్రహాలను వివిధ వాహనాల్లో ఊరేగించారు. పలు గణపతి మంటపాల్లో లడ్డూ వేలం పాటలు నిర్వహించారు.

రాజోలు: చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాజోలు వశిష్ఠ గోదావరి తీరంలో గణేష్ నిమజ్జన మహోత్సవం కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. సుమారు 200 విగ్రహాలను ట్రాక్టర్లపై ఊరేగింపుగా ఘాట్ వద్దకు తోడ్కొని వచ్చారు. రాజోలు, చింతలపల్లి, శివకోడు, తాటిపాక, పొదలాడ, మానేపల్లి, గెద్దాడ, వేగివారిపాలెం, కడలి, నగరం తదితర ప్రాంతాల నుంచి బాణసంచా కాల్పులతో, తీన్మార్ డప్పులతో, డీజే మ్యూజికల్‌తో గణనాథులను ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాజోలు సీఐ గోవిందరాజు బందోబస్తు నిర్వహించారు.



మొగలికుదురులో రూ.50 వేలకు లడ్డూ పాడుకున్న రవికిరణ్



పి.గన్నవరంలో వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు



కొత్తూరులో ట్రాక్టర్‌పై వినాయకుడ్ని ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

రైతు సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం

పి.గన్నవరం: రైతు సంక్షేమం కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం పాటుపడుతున్నారని నరేంద్రపురం సొసైటీ అధ్యక్షుడు మెల్లం మహలక్ష్మీ ప్రసాద్ అన్నారు. సంఘ సీఈఓ పప్పుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం జరిగిన సొసైటీ మహాజన సభలో ప్రసాద్ మాట్లాడుతూ సొసైటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు సందర్భంగా సొసైటీ వద్దే తేమ శాతాన్ని నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. సర్పంచ్ కొంబత్తుల ఏసుబాబు, ఎంపీటీసీ కొక్కిరి లక్ష్మి, నాయకులు బీర బాబాజీ, జల్లి పండు, నేలపూడి సత్యనారాయణ, గుత్తుల చంటి, అంద్రోతు కుమార్, గుత్తుల నాగరాజు, కొంబత్తుల శేషారావు తదితరులు పాల్గొన్నారు.